సాక్షి ప్రకాశం

శుక్రవారం ǀ 21 ǀ మార్చి ǀ 2025



సామాజిక పింఛన్లు ఇంకా పీకేద్దాం!

పింఛన్లలో కోతలు విధించేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. లబ్ధిదారుల అర్హతలపై తనిఖీలు చేయిస్తోంది. ప్రభుత్వ తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

- 8లో..



అంత్యక్రియలకు అడ్డొచ్చిన పేదరికం

పేదరికం కారణంగా అంత్యక్రియలు కూడా చేయలేని దుస్థితిలో ఓ కుటుంబం ఉంది. ఇంటి వద్దే భర్త మృతదేహాన్ని ఉంచి నిస్సహాయస్థితిలో భార్య ఉండిపోయింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం 36/26

వాతావరణం


పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

శుక్రవారం ఇఫ్తార్ సాయంత్రం గం 6 : 29

శనివారం సహారి ఉదయం గం 4 : 55

బోర్డుకి పట్టదు.. రైతుకి గిట్టదు!



- అడకత్తెరలో పొగాకు రైతు
- రెట్టింపయిన సాగు వ్యయం
- తెగుళ్ల కారణంగా భారీగా తగ్గిన దిగుబడి
- వేలంపాటల్లో ఆందోళన కలిగిస్తున్న ధరలు
- మొన్న పత్తి, నిన్న మిరప, నేడు పొగాకు
- రైతుల బాధ పట్టని పొగాకు బోర్డు, ప్రభుత్వం

నాలుగేళ్లుగా లాభాలు చవిచూసిన పొగాకు రైతు నేడు ఆశ-నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు, తగ్గిన దిగుబడులతో రైతు ఆందోళన చెందుతున్నాడు. వేలం కేంద్రాలు ప్రారంభమయ్యాయి. పెరిగిన ఖర్చులతో ప్రస్తుతం వేలం కేంద్రాల్లో నమోదవుతున్న ధరలు రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సాగు సమయంలో అటు బోర్డు అధికారులు, ఇటు ప్రభుత్వ నిర్లక్ష్యం వెరసి నేడు జిల్లాలో పొగాకు రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

సింగరాయకొండ:

ప్రకాశం రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో సుమారు 30 వేల మంది రైతులు పొగాకు సాగుచేస్తున్నారు. పొగాకు బోర్డు ఈ ఏడాది 68,500 హెక్టార్లలో సాగుకు అనుమతివ్వగా పరిమితికి మించి 88 వేల హెక్టార్లలో సాగు చేశారు. బోర్డు అనుమతిచ్చిన పంట ఉత్పత్తి పరిమాణం సుమారు 105.27 మిలియన్ కిలోలు ఉండగా, పంట ఉత్పత్తి అంచనా సుమారు 162 మిలియన్ కిలోలు. సాగు చేసే సమయంలో బోర్డు అధికారులు మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం అయితే వీరిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా నేడు రైతు దిక్కుతోచని స్థితికి చేరుకున్నాడు.

భారీగా పెరిగిన సాగు వ్యయం...

పొగాకు సాగుకు సంబంధించి ఎకరాకు పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. అదే స్థాయిలో ధర కూడా ఉంటుందని రైతులు ఆశపడ్డారు. గత సంవత్సరం ఎకరా పొగాకు సాగు చేయడానికి సుమారు రూ.1.50 లక్షల వరకు ఖర్చవగా, ఈ సంవత్సరం దాదాపు రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు చేరుకుంది. పొలం కౌలు దగ్గర నుంచి బ్యారన్ లీజు, కూలీల ధరలు భారీగా పెరిగిపోయాయి. గత సంవత్సరం పొలం కౌలు ధర ఎకరా రూ.20 వేలు ఉంటే, ఈ దఫా రూ.25 వేల నుంచి రూ.30 వేలకు, బ్యారన్ లీజు (ఆరు ఎకరాలకు) ధర గత సంవత్సరం రూ.1.50 లక్షలు ఉంటే.. ఈ సంవత్సరం రూ.2.50 లక్షల నుంచి రూ.2.80 లక్షలకు, ఒక ముఠా కూలి ధర (8 ఎకరాలకు) గత సంవత్సరం రూ.1.50 లక్షలు ఉంటే ఈ సంవత్సరం రూ.2.50 లక్షలకు చేరిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక, నారు, నాట్లు, నీళ్లు, రవాణా, బ్యారన్ కాల్చేందుకు కర్ర ధరలు సైతం భారీగా పెరిగాయి.

భారీగా తగ్గిన దిగుబడి...

ప్రతి సంవత్సరం పొగాకు ఒక ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈ సంవత్సరం కేవలం 5 నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మల్లె తెగులు సోకడంతో ఆకు నాణ్యత సరిగా లేక దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు బోర్డు అధికారులు పొగాకు సాగులో తీసుకునే సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం వహించారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇష్టారాజ్యంగా నూతన బ్యారన్‌లు నిర్మిస్తున్నా బోర్డు అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప అడ్డుకునే ప్రయత్నం మాత్రం చేయలేదన్న విమర్శలు ఉన్నాయి. బోర్డు అధికారులు ఎంతసేపటికీ పొగాకు సాగు తగ్గించి చిరుధాన్యాలు సాగుచేసుకోవాలని సూచించడం తప్ప పొగాకు అధికంగా సాగు చేయటం వలన కలిగే నష్టాలపై వారికి అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. పరిమితికి మించి సాగు చేస్తున్నారా లేదా అనే పర్యవేక్షణ కూడా కొరవడిందన్న ఆరోపణలు ఉన్నాయి.

పొగాకు రైతును గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం...

పొగాకు రైతును కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పొగాకు రైతును ఆదుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించి ఫలితం సాధించింది. దీంతో ఒక్క సంవత్సరం కూడా రైతు నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి తలెత్తలేదు. ప్రతి సంవత్సరం రైతు భరోసా పథకం ద్వారా నగదు ఇవ్వడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం ఇస్తూ రైతులను ఆదుకుంది. దీనికి తోడు మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించడంతో దళారుల బెడద తప్పి కంపెనీ వారు నేరుగా కొనుగోలు చేస్తూ వచ్చారు. గత సంవత్సరం ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా కిలో రూ.360 పలికింది. ఈ సంవత్సరం ప్రారంభ ధర సుమారు కిలో రూ.300 పలుకుతోందని రైతులు ఆశపడ్డారు. కిలో రూ.280 ధరతో ప్రారంభమై ప్రస్తుతం కిలో రూ.260 ధరతో కొనుగోళ్లు జరగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ సంవత్సరం కూడా పొగాకులో మంచి లాభాలు వస్తాయని ఆశించిన రైతుకు ప్రారంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ధరలు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పత్తి, మిరప రైతులను గాలికి వదిలేసినట్లు పొగాకు రైతును కూడా పట్టించుకోకపోవడంతో వీరు దయనీయస్థితిని ఎదుర్కొంటున్నారు.

అప్పుల పాలు కావాల్సిందే



19 ఎకరాల సొంత పొలం, 35 ఎకరాల కౌలుకు తీసుకున్న పొలంలో పొగాకు సాగు చేస్తున్నా. ఈ సంవత్సరం మల్లె తెగులు కారణంగా ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. సాగు ఖర్చులు కూడా గత సంవత్సరం ఎకరాకు రూ.1.50 లక్షలు అయితే ఈ సంవత్సరం రూ.2 లక్షలు అయింది. ఈ సంవత్సరం కేజీ ధర 400 రూపాయలు ఉంటే తప్ప కోలుకునే పరిస్థితి లేదు. ఆశించిన ధర లేకపోతే అప్పుల పాలు కావాల్సిందే.

– తాటికొండ రామచంద్రరావు, పొగాకు రైతు, పచ్చవ

తగ్గిన దిగుబడి



నేను 11 ఎకరాల్లో పొగాకు సాగుచేస్తున్నా. గత సంవత్సరం ఎకరాకు 1.50 లక్షల రూపాయలు ఖర్చయితే.. ఈ సంవత్సరం 2 లక్షలు ఖర్చయింది. ప్రతి సంవత్సరం ఎకరాకు సుమారు 12 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ సంవత్సరం కేవలం 5 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. కిలో ధర రూ.400 ఉండాలి. లేకపోతే నష్టాలు చవిచూడాల్సిందే.

– పాలడుగు జగదీష్, పొగాకు రైతు, చిర్రికూరపాడు

న్యూస్‌రీల్

ఏఆర్ ఏఎస్సైపై సస్పెన్షన్ వేటు

ఒంగోలు టౌన్:

ఏఆర్ ఏఎస్సై రవికుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఒంగోలు తాలూకా ఎస్సైని అని చెప్పుకుని ఒక విద్యాసంస్థ యాజమాన్యం వద్ద డబ్బు వసూలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై విచారణ అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్ ఐజీకి నివేదిక ఇచ్చారు. దాంతో ఐజీ సస్పెండ్ చేశారు.

24లోగా సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు తెలపాలి

ఒంగోలు సిటీ:

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియార్టీ జాబితాకు సంబంధించిన అభ్యంతరాలను ఈ నెల 24వ తేదీలోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు – మున్సిపల్ కార్పొరేషన్ల కింద పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు/ఉపాధ్యాయుల సాధారణ సీనియార్టీ జాబితాలను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ (టీఐఎస్) ఆధారంగా రూపొందించామన్నారు. ఈ జాబితాలు సంబంధిత జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో, నోటీసు బోర్డులో అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యంతరాల సమర్పణకు అవసరమైన వివరాలను జోడించి ఉపాధ్యాయుడి పూర్తి పేరు, పదవి, సీనియార్టీ జాబితాలో తప్పిదం ఎక్కడుందో స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఆధారాలు తప్పనిసరిగా జతచేయాలని, సంబంధిత అధికారి ధ్రువీకరణతో సమర్పించాలని సూచించారు. గడువు తర్వాత అందిన అభ్యంతరాలు పరిగణలోకి తీసుకోబడవని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుని సంబంధిత ప్రధానోపాధ్యాయులు/ఉపాధ్యాయులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత జిల్లా విద్యాశాఖ/జోనల్ విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

22న ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

నాగులుప్పలపాడు:

ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన సందర్భంగా ఈ నెల 22వ తేదీ నాగులుప్పలపాడు మండలంలోని ఈదుమూడి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ నాయకులు కొమ్మూరి గరటయ్య, మల్లెల ప్రసాద్, ముంగర నాగార్జున తెలిపారు. ఎంఆర్‌పీఎస్ పురిటిగడ్డ ఈదుమూడి గ్రామంలో అత్యవసరంగా నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలు హాజరవుతారని వెల్లడించారు. ఎంఆర్‌పీఎస్ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

కన్నవారికి కడుపుకోత



చిన్నారులు ఈత కొట్టేందుకు దిగిన చెరువు



బాలుర మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లి కల్పన



సంఘటన గురించి గ్రామస్తులకు చెప్పిన నాని

- చెరువులో ఈతకు వెళ్లి అన్నదమ్ముల మృతి
- కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు, బంధువులు

కురిచేడు: అన్నదమ్ముల ఈత సరదా వారి తల్లిదండ్రులకు తీరని వేదన మిగిల్చింది. ఈత కొట్టేందుకు చెరువులో దిగి లోతైన గుంతలో చిక్కుకుని నీటిలో మునిగి ఇద్దరు సోదరులు మృతిచెందారు. ఈ సంఘటన కురిచేడు మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. కురిచేడులోని పడమరహరిజనవాడకు చెందిన బత్తుల నరసింహారావు, కల్పన దంపతుల కుమారులు బత్తుల అభి (10), బత్తుల పాల్ (8) మధ్యాహ్న సమయంలో సరదాగా ఈత కొట్టేందుకు హరిజనవాడ పక్కనే ఉన్న చిన్నచెరువు వద్దకు వెళ్లారు. ఈత కొట్టేందుకు చెరువులోకి దిగారు. అయితే, అక్కడ లోతైన గుంత ఉండటంతో నీటిలో మునిగి మృతిచెందారు. మరో బాలుడు మాలపోలు నాని భయపడి ఇంటికొచ్చి పెద్దలకు చెప్పడంతో వారు హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి అభి, పాల్ మృతదేహాలను బయటకు తీశారు. తల్లిదండ్రులు, బంధువులు భోరున విలపించారు.

అన్న కోసం తమ్ముడు దూకి...

ఉదయం పాఠశాలకు వెళ్లి ఒంటిపూట బడులు కావడంతో మధ్యాహ్నానికి ఇంటికొచ్చిన అభి, పాల్ పుస్తకాలు ఇంట్లో పెట్టి బహిర్భూమికని చెప్పి పక్కనే ఉన్న చిన్న చెరువు వద్దకు వెళ్లారు. ముందుగా అభి ఈత కొడదామంటూ తమ్ముడికి చెప్పి చెరువులో దూకాడు. కానీ, ఎంతసేపటికీ బయటకు రాలేదు. దాంతో భయపడిన పాల్ పరిగెత్తుకుంటూ హరిజనవాడ వచ్చి అతని స్నేహితుడు మాలపోలు నానికి జరిగిన విషయం చెప్పి చెరువు వద్దకు తీసుకెళ్లాడు. నాని చూస్తుండగానే పాల్ కూడా తన అన్న కోసం చెరువులో దూకాడు. ఇద్దరూ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో నాని ఇంటికొచ్చి అభి, పాల్ కుటుంబ సభ్యులకు జరిగిన విషయం చెప్పాడు. వెంటనే స్థానికులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈతగాళ్ల సాయంతో గాలించగా, చెరువులోని లోతైన గుంతలో చిన్నారులిద్దరూ విగతజీవులుగా కనిపించారు. వారిని బయటకు తీసి ఇంటికి తరలించారు. తల్లిదండ్రులకు వీరిద్దరే సంతానం కాగా, తండ్రి నరసింహారావు బేల్దారి పనులు చేస్తుంటాడు. తల్లి కల్పన పొలం పనులకు వెళ్తుంటుంది. కూలీనాలీ చేసుకుని బిడ్డలను పాఠశాలకు పంపి చదివిస్తున్నారు. బత్తుల అభి 4వ తరగతి, పాల్ 3వ తరగతి చదువుతున్నారు. పెరిగిపెద్దయ్యాక తమకు అండగా ఉంటారనుకున్న పిల్లలు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదన మిన్నంటింది. వారిని ఓదార్చడం ఎవరి వల్లా కాలేదు. బంధువులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో చేరుకుని కంటతడి పెట్టారు. పడమర హరిజనవాడ మొత్తం విషాదం అలముకుంది.

గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు, డాక్టర్లు

- రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్

ఒంగోలు సిటీ: ప్రతి ఆరోగ్య కార్యకర్త గర్భిణులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి రిజిస్టర్ చేసి సకాలంలో మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. రాష్ట్రంలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు, ప్రోగ్రాం అధికారులకు గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆయన మాట్లాడారు. స్కూల్ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేసి వేసవిలో వ్యాధుల బారి నుంచి కాపాడుకోవాలని సూచించారు. పలు అంశాలపై సమీక్షించారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త, సీహెచ్ఓ రక్తహీనతతో బాధపడుతున్న వారికి సరైన చికిత్స అందిస్తే మాతృమరణాలు నివారించవచ్చని తెలిపారు. 5 సంవత్సరాల్లోపు పిల్లలు బరువు తక్కువగా ఉంటే గుర్తించి న్యూట్రీషన్ రీహాబిలిటేషన్ సెంటర్‌కు రిఫర్ చేసి శిశుమరణాలు నివారించాలని ఆదేశించారు. పుట్టిన ప్రతి బిడ్డకు నిర్దేశించిన అన్ని టీకాలు సకాలంలో వేసి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న పిల్లలకు రాష్ట్ర బాల సురక్ష కార్యక్రమం ద్వారా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఓఆర్ఎస్ ద్రవం తయారు చేసుకోవడం గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డాక్టర్ పి.పద్మజ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ శ్రవణ్, డాక్టర్ హేమంత్, చల్లా ప్రభాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు రూ.10 వేల కోట్లు కేటాయించండి

- ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజా సమస్యలు పరిష్కరించండి
- సీపీఎం ధర్నాలో పలువురు వక్తలు



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం కార్యవర్గసభ్యుడు ఆంజనేయులు, పాల్గొన్న నాయకులు

ఒంగోలు సిటీ: వెనుకబడిన జిల్లాగా గుర్తించబడిన ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికి పది వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. వెలిగొండ ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయాలని, జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలని కోరారు. ఆ మేరకు సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జీ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాట్లాడుతూ దశాబ్దకాలం అనేక ఉద్యమాలు, జైలుశిక్షల ఫలితంగా వెనుకబడిన జిల్లాగా కేంద్రం ప్రకటించినప్పటికీ జిల్లా వెనుకబాటుతనాన్ని రూపుమాపే దిశగా నిధులు కేటాయించలేదన్నారు. పాలకవర్గాలు సైతం జిల్లా అభివృద్ధిని విస్మరించారని పలువురు వక్తలు దుయ్యబట్టారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే నిధులు కేటాయించాలని, దామాషా ప్రకారం నిధులు రాబట్టేందుకు ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, విస్మరిస్తే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో గ్రానైట్, ఆక్వా, పొగాకు వంటి వనరుల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.20 వేల కోట్ల ఆదాయం జమవుతుందన్నారు. జిల్లా ప్రజానీకానికి చెందిన ఈ సంపదలో జిల్లా వాటాగా రూ.10 వేల కోట్లు ఒకే విడత అందిస్తే వెలిగొండ, సంగమేశ్వరం, పాలేటిపాడు, గుండ్లకమ్మ వంటి సాగునీటి ప్రాజెక్టులు పూర్తయి వ్యవసాయం అభివృద్ధి చెందడంతో పాటు తాగునీటి సమస్య కూడా పరిష్కారమవుతుందని అన్నారు. దీంతోపాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెంది అన్ని రకాలుగా ప్రగతి సాధిస్తుందన్నారు. అన్ని రకాలుగా వెనుకబడిన ప్రకాశం జిల్లా బీపీ, షుగర్ వంటి వ్యాధుల్లో మాత్రం అగ్రస్థానంలో ఉందన్నారు. ఉపాధి అవకాశాలు కరువై మానసిక ఒత్తిడికి గురవుతున్న ప్రజలు వ్యాధుల బారిన పడటమే అందుకు కారణమని విశ్లేషించారు. సాగునీటి వనరులు లేక వ్యవసాయం అభివృద్ధి చెందక ఉపాధి అవకాశాలు కరువై ఏటా 5 లక్షల మంది ఉపాధి కోసం వలసలు వెళ్తున్నారని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ రూ.లక్ష కోట్ల అప్పులతో రూపొందించటం ప్రజలను అప్పుల్లోకి నెట్టే చర్యగా విమర్శించారు. రాజధాని నిర్మాణానికి రాష్ట్రం రూ.46 వేల కోట్ల అప్పు చేయడం ప్రజలకు మరో భారంగా పరిణమిస్తోందన్నారు. కేంద్రం ప్రకటించిన రూ.లక్ష కోట్ల గ్రాంట్ కోసం ముఖ్యమంత్రి ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు సీపీఎం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజలు చైతన్యవంతులై ఉద్యమం చేపడతారని హెచ్చరించారు. ధర్నాలో సీపీఎం సీనియర్ నాయకుడు పెంట్యాల హనుమంతరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.వెంకటరావు, కేజీ మస్తాన్, కంకణాల రమాదేవి, పెంట్యాల కల్పన, జజ్జూరు జయంతిబాబు, కాలం సుబ్బారావు, వి.బాలకోటయ్య, బంకా సుబ్బారావు, వెల్లంపల్లి ఆంజనేయులు, టంగుటూరు రాము, ఉబ్బ ఆదిలక్ష్మి, పల్లాపల్లి ఆంజనేయులు, కిలారి పెద్దబ్బాయి, టి.శ్రీకాంత్, ఎస్.స్వామిరెడ్డి, నెరుసుల వెంకటేశ్వర్లు, వి.మోజస్, తంబి శ్రీనివాసులు, టి.మహేష్, కేఎఫ్ బాబు, ఎస్‌డీ హుస్సేన్, కంకణాల వెంకటేశ్వర్లు, ఎస్‌కే అమీర్, ఉబ్బ వెంకటేశ్వర్లు, దామా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ వెంకటనాయుడు

మద్దిపాడు: మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జి.వెంకట నాయుడు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఇనమనమెళ్లూరు పంచాయతీని గురువారం ఆకస్మికంగా ఆయన సందర్శించారు. ఇంటి పన్నుల వసూళ్లు జరుగుతున్న తీరును పరిశీలించారు. పంచాయతీలో ఇంకా వసూలు కావాల్సి ఉన్న 2.78 లక్షల రూపాయల పన్నులపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ఉదయం, సాయంత్రం, సెలవు దినాలలో ప్రజలకు అందుబాటులో ఉండి నూరుశాతం పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పూర్తి స్థాయిలో వాడుకలోకి తీసుకురావాలని చెప్పారు. వారంలో మూడు రోజుల పాటు ఐవీఆర్ సర్వే జరుగుతుందని, ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ పాజిటివ్‌గా ఉండేందుకు ప్రతిరోజూ గ్రామాల్లో చెత్త సేకరణ జరగాలని సూచించారు. పీఆర్ఓన్ యాప్‌లో టాస్క్‌లను వెంటనే పూర్తి చేసి గ్రామ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఈఓపీఆర్‌డీ రఘుబాబుతో డీపీఓ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో హౌస్ ట్యాక్స్, నాన్ ట్యాక్స్‌లను నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు.

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె


వైఎస్ జగన్‌తో అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించారు. అనంతరం ఇటీవల పదవులు పొందిన నియోజకవర్గ నాయకులను వైఎస్ జగన్‌కు పరిచయం చేశారు. కార్యకర్తలకు అండగా ఉంటూ క్షేత్ర స్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు నేతలు తెలిపారు. మార్కాపురం టౌన్, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు అడ్డొచ్చిన పేదరికం!


భర్త శవం వద్ద దీనంగా కూర్చున్న సొదమ్మ

గిద్దలూరు రూరల్: ఆ కుటుంబానికి పేదరికం శాపంగా మారింది. ఇంటి యజమాని చనిపోతే అంత్యక్రియలు చేయలేని స్థితిలో వారిని నిలబెట్టింది. వివరాల్లోకి వెళ్తే.. గిద్దలూరు పట్టణంలోని ఏబీఎం పాలెంలో నివాసం ఉంటున్న పానుగంటి దానియేలు(48)కు కాలేయ సంబంధిత వ్యాధితో గురువారం మృతి చెందాడు. వృత్తిరీత్యా పెయింటింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే దానియేలు మృతి చెందడంతో భార్య సొదమ్మ దీనంగా రోదిస్తోంది. భర్త అంత్యక్రియలు నిర్వహించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఇంటి వద్ద భర్త శవాన్ని పెట్టుకుని నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. కుమారుడు, కుమార్తె చిన్న పిల్లలు కావడం, భర్త అర్ధంతరంగా మృతి చెందడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయింది. అంత్యక్రియలు నిర్వహించేందుకు దాతలు సాయం చేయాలని వేడుకుంటోంది.

'గేట్'లో అంకిరెడ్డిపల్లె విద్యార్థికి ఆలిండియా 272వ ర్యాంకు


మహమ్మద్

గిద్దలూరు రూరల్: గేట్(గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్)లో మండలంలోని అంకిరెడ్డిపల్లెకు చెందిన షేక్.మహమ్మద్ జాతీయ స్థాయిలో 272వ ర్యాంక్ సాధించాడు. గుంటూరు ఏఎన్‌యూలో 90 శాతం మార్కులతో బీటెక్ పూర్తి చేసిన మహమ్మద్ ఫిబ్రవరి 2న హైదరాబాద్‌లో 'గేట్' రాయగా గురువారం ఫలితాలు వెల్లడయ్యాయి. మహమ్మద్‌తోపాటు అతడి తండ్రి షేక్ పీరావలిని గ్రామస్తులు అభినందించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


సిసింద్రీ మృతదేహం

సింగరాయకొండ: పాకల బీచ్‌లో బుధవారం గల్లంతైన చాట్రగడ్డ సిసింద్రీ(27) మృతదేహం కొత్తపట్నం మండలం మడనూరు సముద్ర తీరంలో లభ్యమైనట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. సిసింద్రీ టంగుటూరు మండలం ఎం.నిడమానూరు ఎస్సీ కాలనీలో నివసిస్తుంటాడు. తన బంధువులైన యువకులతో కలిసి బుధవారం పాకలలో సముద్ర స్నానానికి వచ్చి గల్లంతైన విషయం తెలిసిందే. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సామాజిక పింఛన్లు ఇంకా పీకేద్దాం!


ఒంగోలు జీజీహెచ్‌లో సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చి వేచి ఉన్న విభిన్న ప్రతిభావంతులు

'వైఎస్సార్ సీపీ హయాంలో వారికి పింఛన్లు మంజూరయ్యాయి. అంటే వారంతా ఆ పార్టీ సానుభూతిపరులే. పింఛన్లు పీకేస్తే అంతా దారికొస్తారు. అర్హత ఉన్నా సరే అనర్హత వేటు వేస్తే సరి. కొత్త పింఛన్ల సంగతి తర్వాత చూద్దాం' కూటమి ప్రభుత్వ పాలకుల తీరు అచ్చు ఇలాగే ఉంది. సామాజిక పింఛన్ల తనిఖీ పేరుతో కూటమి ప్రభుత్వం ఆడుతున్న రాజకీయ క్రీడలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు ఆర్థిక భరోసా కోల్పోతున్నారు.

- పెన్షన్ల తనిఖీ వెనుక ఏరివేతలే లక్ష్యం
- ఇప్పుడు దివ్యాంగుల వంతు..
- సదరం వెరిఫికేషన్ క్యాంపుల్లో పడిగాపులు
- నూతన పెన్షన్ల మంజూరుపై 10 నెలలుగా దాటవేత ధోరణి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని వంచన

ఒంగోలు వన్‌టౌన్:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 10 నెలలు గడుస్తున్నా అర్హులైన ఒక్కరికి కూడా పింఛను మంజూరు చేయలేదు. కానీ ఎక్కడికక్కడ వడపోత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పింఛన్లు పీకేయడమే లక్ష్యంగా సదరం సర్టిఫికెట్లు, ఆరోగ్య పరిస్థితి తనిఖీ పేరుతో క్యాంపులు నిర్వహించడంపై దుమారం రేగుతోంది. పింఛను సొమ్ము పెంచామని గొప్పలు చెబుతూనే.. వెరిఫికేషన్ పేరుతో ఆర్థిక ఆసరాను నిలిపివేస్తున్న తీరు తీవ్ర చర్చనీయాంశమైంది. కొత్త పెన్షన్లు ఇవ్వకపోగా ఉన్న వాటినీ ఎత్తేస్తున్నారని పలువురు లబ్ధిదారులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రభుత్వం వద్ద ఉన్న డేటా ఆధారంగా పింఛన్లను పరిశీలించాలని నిర్ణయించిన కూటమి ప్రభుత్వం.. సాకులు చూపుతూ కత్తెర వేస్తుండటం గమనార్హం. వెరిఫికేషన్‌కు రావాలని సరైన సమాచారం ఇవ్వకుండానే, క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లిన సమయంలో ఇంటికి తాళం వేసి ఉన్నట్లుగా నమోదు చేస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిని చక్కదిద్దుకునేందుకు అవకాశం కల్పించకపోగా.. అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా పట్టించుకోవడం లేదని పింఛను లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

50 ఏళ్లకే పింఛను పేరుతో కూటమి వంచన

కూటమి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఇదే విషయాన్ని పదే పదే చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చి 10 నెలలైనా సీఎం చంద్రబాబునాయుడు ఈ హామీపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. దీంతో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో 50 ఏళ్లు నిండిన వారు సుమారు లక్ష మంది వరకు పింఛను కోసం ఎదురుచూస్తున్నారు. వీరంతా గ్రామ/వార్డు సచివాలయాల చుట్టూ, డీఆర్‌డీఏ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.


జీజీహెచ్‌లో విభిన్నప్రతిభావంతులను పరిశీలిస్తున్న డాక్టర్

అడ్డగోలుగా పింఛన్ల నిలిపివేత

ఒక్క ఫిబ్రవరి నెలలోనే సీకేడీ(క్రానిక్ కిడ్నీ డిసీజ్) పింఛన్లు 415 నిలిపివేశారు. చిరునామాలు లేవని, వెరిఫికేషన్‌కు రాలేదని కారణంగా చూపారు. వాస్తవానికి సీకేడీ పింఛనుదారులు మంచానికే పరిమితమయ్యారా లేదా అని పరిశీలించి, వేలిముద్రలు, ఫొటోలతో సహా యాప్‌లో నమోదు చేయాలని మార్గదర్శకాలు ఉన్నా అటువంటివి ఏమీ చేయకుండానే పింఛను నిలిపివేయడం పాలకుల తీరుకు అద్దం పడుతోంది. అదే విధంగా రూ.15 వేలు పింఛను పొందుతున్న పక్షవాతం బాధితులు, మరొకరి సహాయం లేకుండా తమ పని తాము చేసుకోలేని వారి పింఛన్లను కూడా పరిశీలన పేరుతో పీకేశారు.

దివ్యాంగులకు జెల్ల కొట్టేందుకు స్కెచ్

దివ్యాంగుల పింఛన్లను రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు అధికారులు జిల్లాలోని 33184 మంది దివ్యాంగుల సర్టిఫికెట్లను తనిఖీ చేస్తున్నారు. అంగవైకల్యంతో బాధపడుతూ రూ.6 వేలు పెన్షన్ తీసుకుంటున్న వారి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీనికిగాను చీమకుర్తి, కొండపి, దర్శి, గిద్దలూరు, యర్రగొండపాలెంలో సదరం క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే నియమించిన వైద్యులు కాకుండా ఇతర వైద్యులతో ధ్రువపత్రాల పరిశీలన చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒంగోలు జీజీహెచ్‌లో ఇతర విభాగాలకు చెందిన వైద్యులు కూడా దివ్యాంగులను పరిశీలించి యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు.

కొత్త పింఛన్లు గగనమే..

జనవరి నుంచి నూతన పింఛన్లు అందిస్తామని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గత ఏడాది నవంబర్‌లో ప్రకటించారు. జనవరి తర్వాత ప్రతి 6 నెలలకు ఒకసారి నూతన పింఛన్లు పంపిణీ చేస్తామని అర్భాటం చేశారు. ప్రస్తుతం మార్చి నెల ముగుస్తున్నా ఇంత వరకు ప్రభుత్వ పెన్షన్ పోర్టల్ ప్రారంభించలేదు. గతంలోనే దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్న ఒక్కరికీ పింఛను మంజూరు చేయలేదు. వెరిఫికేషన్ పేరుతో నెలల తరబడి కాలయాపన చేస్తుండటంతో అర్హులందరూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఫిబ్రవరిలో జిల్లాలో 17 రకాల పింఛనుదారులు మొత్తం 2,85438 మంది ఉండగా.. మార్చి నెలలో ఆ సంఖ్య 2,83854కు పడిపోయింది. అంటే 1584 మందిని పింఛను జాబితా నుంచి తొలగించారు. సదరం వెరిఫికేషన్ మరో పది రోజులపాటూ కొనసాగనుందని సమాచారం.

పింఛన్లు తొలగించడం సరికాదు



తనిఖీ పేరుతో అడ్డగోలుగా పింఛన్లు తొలగిస్తే ఊరుకునేది లేదు. సదరం వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను ఇబ్బందులకు గురిచేస్తూ, ఎటువంటి కారణం చూపకుండా పింఛన్లు ఆపేయడం ప్రభుత్వానికి మంచిది కాదు. వెరిఫికేషన్ ప్రక్రియను నిశితంగా గమనిస్తున్నాం. అవసరమైతే జిల్లాలో దివ్యాంగులతో కలిసి ఉద్యమం చేపడతాం.

– దొంతిరెడ్డి గోపాలరెడ్డి, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు

టీచర్ లైంగిక వేధింపుల కేసు..

రెండో నిందితురాలిగా హెచ్‌ఎం

- డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ వెల్లడి
- తనపై దాడి చేశారని పోలీసులకు హెచ్‌ఎం ఫిర్యాదు
- హెచ్‌ఎంపై కేసును తీవ్రంగా ఖండించిన యూటీఎఫ్ నేతలు

కనిగిరి రూరల్: కనిగిరి జెడ్పీ బాలికోన్నత పాఠశాల టీచర్ రంగారెడ్డిపై నమోదైన పోక్సో కేసులో రెండో నిందితురాలిగా ప్రధానోపాధ్యాయురాలు కలువ విజయలక్ష్మిని చేర్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలిపారు. గురువారం డీఎస్పీ విలేకర్లతో మాట్లాడారు. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి సమాచారాన్ని పోలీసులకు రిపోర్ట్ చేయనందుకుగాను పోక్సో యాక్ట్ సెక్షన్–21 ప్రకారం హెచ్‌ఎంను కూడా నిందితురాలిగా చేర్చినట్లు వివరించారు. కాగా, విధి నిర్వహణలో ఉన్న తనపై కొందరు మహిళలు బుధవారం దాడి చేసి గాయపరిచారని, మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారని హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై ఇంకా ఎటువంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు వెల్లడించారు.

హెచ్‌ఎంపై పోక్సో కేసు నమోదు అన్యాయం


మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

కనిగిరి జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మిపై పోలీసులు కేసు పెట్టడాన్ని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, నాయకులు ఎస్‌కే ఖాజా రహ్మతుల్లా, ఎం.రాము, మీగడ వెంకటేశ్వరరెడ్డి, మల్లికార్జున, నరసింహం తీవ్రంగా ఖండించారు. గురువారం విలేకర్ల సమావేశంలో యూటీఎఫ్ నాయకులు మాట్లాడారు. స్కూల్లో బాలికలతో టీచర్ అసభ్యకరంగా ప్రవర్తించిన విషయాన్ని డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓకు హెచ్‌ఎం తెలియజేశారని వివరించారు. టీచర్‌పై చర్యలు తీసుకునేందుకు హెచ్‌ఎం తన వంతు కృషి చేశారని చెప్పారు. బుధవారం విద్యార్థినుల తల్లుల పేరుతో పాఠశాలలోకి ప్రవేశించిన కొందరు మహిళలు హెచ్‌ఎంతోపాటు, మహిళా స్కావెంజర్‌పై భౌతిక దాడికి పాల్పడినా, హెచ్‌ఎం మెడలో నల్లపూసల గొలుసు లాక్కుని వెళ్లినా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం గర్హనీయమన్నారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల అభివృద్ధిని చూసి ఓర్వలేని కొన్ని విద్రోహ శక్తులు మరింత రచ్చ చేసి టీచర్లను అభద్రతా భావంలోకి నెట్టేందుకు ప్రయత్నించాయని ఆరోపించారు. పాఠశాలలో టీచర్లకు రక్షణ కల్పించాలని కోరారు. హెచ్‌ఎం, స్కావెంజర్‌పై దాడి చేసి గాయపర్చిన వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని, వారు లాక్కెళ్లిన నల్లపూసల గొలుసును హెచ్‌ఎంకు అప్పగించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని, హెచ్‌ఎంపై నమోదు చేసిన కేసును విత్ డ్రా చేయాలని డిమాండ్ చేశారు.

మూడేళ్ల పసికందును చంపిన తండ్రికి యావజ్జీవం

- తీర్పు వెల్లడించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు: భార్యపై అనుమానంతో మూడేళ్ల కుమారుడిని పాశవికంగా హత్య చేసిన కేసులో తండ్రికి యావజ్జీవ జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ ప్రకాశం జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. నెల్లూరుకు చెందిన షేక్ ఖాదర్‌వలి, షేక్ సల్మా ప్రకాశం జిల్లా చీమకుర్తిలోని యల్లయ్యనగర్‌లో నివాసం ఉండేవారు. వీరికి కుమారుడు షాహుల్(3) ఉన్నాడు. భార్యపై అనుమానం పెంచుకున్న ఖాదర్ ప్రతిరోజూ ఆమెను వేధించేవాడు. ఈ క్రమంలో 2018 నవంబర్ 30న ఖాదర్ తన బైక్‌పై షాహుల్‌ను తీసుకెళ్లాడు. సాయంత్రం భర్త ఒక్కడే ఇంటికి రావడంతో సల్మా ప్రశ్నించింది. తనకు తెలియదంటూ ఖాదర్ నిర్లక్ష్యంగా జవాబివ్వడంతో.. చీమకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఖాదర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా.. నేరాన్ని అంగీకరించాడు. షాహుల్‌ను హత్య చేసి బూదవాడ ఎర్రకొండలలో పూడ్చి పెట్టినట్లు ఖాదర్ వెల్లడించాడు. వాదనల అనంతరం.. ఖాదర్‌కు యావజ్జీవ జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎ.భారతి తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ఎస్సైలు జీవీ చౌదరి, దుర్గాప్రసాద్, ఏఎస్సై వీరాస్వామి, కోర్టు లైజన్ ఆఫీసర్ రాఘవ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.వసుంధరను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

చేపల వేటకు వెళ్లి మృత్యు ఒడిలోకి..

- వాగులో తవ్విన గుంతలో పడి యువకుడు మృతి
- పొన్నలూరు మండలం చెన్నిపాడులో సంఘటన


చిరంజీవి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనూక్

పొన్నలూరు: చేపల వేటకి వెళ్లిన యువకుడు మృత్యు ఒడికి చేరాడు. ఈ సంఘటన పొన్నలూరు మండలం చెన్నిపాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకోగా గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం మేరకు.. నూకతోటి నాగేశ్వరరావు, పోలమ్మ దంపతులకు నలుగురు కుమారులు, కుమార్తె సంతానం. మూడో కుమారుడు చిరంజీవి(18) పుట్టుకతోనే మూగ, చెవిటి కావడంతో చదువు మానేసి గ్రామంలో పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా ఉన్నాడు. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో చేపలు పట్టడానికి వెళ్తున్నట్లు తల్లికి సైగల ద్వారా చెప్పి గ్రామానికి ఉత్తరం వైపు ఉన్న మాలోల్ల వాగు దగ్గరకు వెళ్లాడు. కూలీ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లికి కుమారుడు కనిపించకపోవడంతో చుట్టు పక్కల విచారించింది. బంధువుల సాయంతో టార్చి లైట్ల వెలుగులో మాలోల్ల వాగు పరిసరాల్లో వెతికినా జాడ కనిపించలేదు. పక్కనే ఉన్న యర్రగుంట వాగులో వెతకగా చిరంజీవి విగతజీవిగా నీటిపై తేలియాడుతూ కనిపించాడు. అప్పటికే చీకటి పడి పొద్దుపోవడంతో మృతదేహాన్ని వెలికితీయలేదు. గురువారం ఉదయం విషయం పోలీసులకు తెలియడంతో ఎస్సై అనూక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

వల ఒకచోట... మృతదేహం మరో చోట

చిరంజీవి మృతిపై బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చేపలు పట్టడానికి వేసిన వల, అతని చెప్పులు, దుస్తులు మాల్లోల వాగు వద్ద ఉండగా.. చిరంజీవి మృతదేహం మాత్రం ఈ వాగుకు సుమారు 100 అడుగుల దూరంలో ఉన్న యర్రగుంట వాగులో బయటపడటం అనుమానాలకు కారణమైంది. చిరంజీవి ప్రమాదవశాత్తు వాగులో పడి మరణించాడా.. లేక చంపి పడేశారా? అనే చర్చ నడుస్తోంది. దివ్యాంగుడైన చిరంజీవి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

ఆరుగాలం శ్రమ..

అగ్నికి ఆహుతి

- పామూరు మండలం కంబాలదిన్నెలో 100 ఎకరాల్లో కంది పైరు దగ్ధం
- రూ.30 లక్షల మేర నష్టం.. ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి
- మంటలు ఆర్పేందుకు ఆరు గంటలకు పైగా శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది
- ఆకతాయిలే నిప్పంటించి ఉంటారని అనుమానం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది


మంటల్లో కాలిపోతున్న కంది పైరు

పామూరు: వ్యయప్రయాసలకోర్చి పండించిన కంది పంట ఆకతాయిల చేష్టలతో అగ్నికి ఆహుతైంది. సుమారు 100 ఎకరాల్లో కోసి ఉంచిన, కోతకు వచ్చిన కంది పైరు కళ్ల ముందే కాలిపోవడాన్ని చూసి రైతుల కళ్లలో కన్నీళ్ల సుడులు తిరిగాయి. ఈ విషాద ఘటన పామూరు మండలంలోని కంబాలదిన్నె సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. కంబాలదిన్నె సమీపంలో 40 మంది రైతులు సుమారు 100 ఎకరాల్లో సాగు చేసిన కంది పైరు సాగు చేశారు. కొందరు రైతులు కంది కోసి ఓదెలు వేశారు. మరికొంత పంట 10 రోజుల్లో కోతకు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో గుర్తు తెలియని ఆకతాయిలు నిప్పు పెట్టడంతో కంది పంట మొత్తం కాలి బూడిదైంది. రైతుల నుంచి సమాచారం అందుకున్న కనిగిరి అగ్నిమాపక శాఖాధికారి బంగారుబాబు తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు 6 గంటలకు పైగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదం కారణంగా రూ.30 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతులు పిచ్చాల రామకృష్ణారెడ్డి, చింతగుంట్ల కొండలరావు, యాదాల కోటయ్య, ఇరగల శ్రీను, బాస్కర్‌రెడ్డి, మన్నం రమణయ్య, నీలం వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, సంఘటనా స్థలాన్ని వీఆర్‌ఓ దుద్దుకూరి శ్రీనివాసులు, వీఏఏ రమేష్, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్‌తో కలిసి తహసీల్దార్ బీవీ రమణారావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు.

మద్యానికి బానిసలై..

అన్నదాతలను క్షోభ పెట్టి..

- డీజిల్ ఇంజన్లు, సోలార్ ప్లేట్ల దొంగలు ముగ్గురికి సంకెళ్లు
- నిందితుల వివరాలు వెల్లడించిన సింగరాయకొండ సీఐ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: మద్యం వ్యసనానికి బానిసలై, డబ్బు కోసం దొంగలుగా మారి పొలాల్లో డీజిల్ ఇంజన్లు, సోలార్ ప్లేట్లు చోరీ చేస్తున్న దొంగలు ముగ్గురిని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. నిందితుల నుంచి రూ.85 వేల నగదు, డీజిల్ ఇంజన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ హజరత్తయ్య వెల్లడించారు. టంగుటూరు మండలం మల్లవరప్పాడు గ్రామానికి చెందిన గౌతుకట్ల అశోక్, పొన్నూరి రాంబాబు, పాటిబండ్ల శ్రీకాంత్ మద్యానికి బానిసలయ్యారు. ఈ క్రమంలో డబ్బు కోసం టంగుటూరు, సంతనూతలపాడు మండలాల పరిధిలోని పొలాల్లో చోరీలకు పాల్పడేవారు. గత ఏడాది ఫిబ్రవరిలో కందులూరు, ఎర్రజర్ల గ్రామాల మధ్య పొలాల్లో పైడి శ్రీను అనే రైతుకు చెందిన 20 సోలార్ ప్లేట్లు, ఈ ఏడాది మార్చి మొదటి వారంలో టంగుటూరు మండలం మల్లవరప్పాడులోని పెద్దచెరువు దక్షిణం వైపు కట్ట మీద ఉన్న నాగినేని రంగారావుకు చెందిన డీజిల్ ఇంజన్, అలాగే 10 రోజుల క్రితం సంతనూతలపాడు నుంచి మైనంపాడు వెళ్లే రోడ్డులో ఉన్న పొలాల్లో 15 సోలార్ ప్లేట్లు చోరీ చేసినటులపోలీసుల విచారణలో నిందితులు అంగీకరించారు. గురువారం తనిఖీలు నిర్వహించే సమయంలో అనుమానాస్పదంగా ఉండగా అదుపులోకి తీసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ చెప్పారు. కేసులను ఛేదించేందుకు కృషి చేసిన టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది డి శ్రీనివాసరావు, ఎస్ వెంకటరావు, మహేష్, ఖాదర్‌వలి, నాగార్జునను సీఐ అభినందించారు.